సాక్షి గుంటూరు

బుధవారం ; 21 ; ఫిబ్రవరి ; 2024



నాగమౌనీంద్రస్వామి తిరునాళ్ల

బొల్లాపల్లి: పేరూరుపాడులోని నాగమౌనీంద్రస్వామి తిరునాళ్ల వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వచ్ఛంద సంస్థలు అన్నవితరణ గావించాయి.



భూముల సర్వే ప్రారంభం

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలం వి.అప్పాపురంలో డ్రోన్ సర్వే మంగళవారం ప్రారంభించారు. సర్వే త్వరగా పూర్తి చేస్తామని సర్వేయర్ చండీరాణి తెలిపారు.



ఘనంగా కల్యాణ మహోత్సవం

గుంటూరు మెడికల్: శ్రీనివాస సేవా సమితి ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు.

న్యూస్‌రీల్

25న మంగళగిరి ఎయిమ్స్ జాతికి అంకితం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఈనెల 25న మంగళగిరి ఎయిమ్స్‌ను ప్రధాని మోదీ జాతికి అంకితం చేయనున్నారు. మంగళగిరిలో 183 ఎకరాల విస్తీర్ణంలో 960 పడకల ఆసుపత్రి, 125 ఎంబీబీఎస్ సీట్లతో మెడికల్ కాలేజీ నిర్మించిన సంగతి తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం దేశంలో కొత్తగా ఐదు ఎయిమ్స్‌లను నిర్మించింది. మంగళగిరితో పాటు దేశంలో కొత్తగా నిర్మించిన ఐదు ఎయిమ్స్‌లను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జాతికి అంకితం చేయనున్నారు. అలాగే అదే రోజు విశాఖలోని మైక్రో బయాలజీ ఫుడ్ టెస్టింగ్ ల్యాబొరేటరీ, నాలుగు మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబొరేటరీలను కూడా ప్రధాన మంత్రి వర్చువల్‌గా ప్రారంభిస్తారు.

ఐఎఫ్‌పీల ద్వారా బోధన చేయాలి

పాఠశాల విద్య ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి



గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ (ఐఎఫ్‌పీ) ద్వారా విద్యాబోధన చేయాలని పాఠశాల విద్య ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పాత బస్టాండ్ సెంటర్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల్లోని అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాలలో ఏర్పాటుచేసిన ఐఎఫ్‌పీలను ఉపయోగించి ఉపాధ్యాయులు విద్యాబోధన సాగించాలని సూచించారు. బైజూస్ ట్యాబ్స్‌ను విద్యార్థులందరూ ఉపయోగించే విధంగా చర్యలు చేపట్టడంతోపాటు ఆరో తరగతి నుంచి టోఫెల్ తప్పనిసరిగా బోధించాలని ఆదేశించారు. ఆయన వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్వీఆర్ ప్రసాద్, ఉపాధ్యాయులు ఉన్నారు.

25లోపు క్రికెట్ అంపైర్ల పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలి

గుంటూరు వెస్ట్ (క్రీడలు): జిల్లా స్థాయిలో నిర్వహించనున్న వివిధ స్థాయిల క్రికెట్ పోటీలకు అవసరమైన అంపైర్లు, స్కోరర్ల ఎంపిక పరీక్షకు ఈనెల 25లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎంఎస్‌పీవీ రమణమూర్తి, దాసరి రమేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల స్త్రీ, పురుషులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎంపిక పరీక్ష ఈ నెలాఖరున ఉంటుందని తెలిపారు. వివరాలకు 97042 53968 సంప్రదించాలన్నారు.

మహాశివరాత్రి ప్రత్యేక అభిషేక పథకంలో చేరండి

అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతి శ్రీ బాలచాముండికాసమేత అమరేశ్వరస్వామి వారికి మార్చి 8వ తేదీన మహా శివరాత్రినాడు అమరేశ్వరస్వామి వారికి భక్తుల గోత్రనామాలతో ప్రత్యేక అభిషేకం నిర్వహించేందుకు ప్రత్యేక అభిషేక పథకంలో చేరాలని ఆలయ ఈఓ వేమూరి గోపినాథశర్మ కోరారు. మంగళవారం ఆయన ఈ పథకం గురించి వివరిస్తూ స్వామి వారికి అభిషేకం చేయించుకునే భక్తులు రూ.516 చెల్లించాలని, అలా చెల్లించిన భక్తులకు పరోక్ష పద్ధతిలో అభిషేకం నిర్వహించటమే కాక శివరాత్రి అనంతరం స్వామి వారి విశేష ప్రసాదాన్ని పోస్టు ద్వారా పంపనున్నట్లు తెలిపారు. రూ.516 నగదును దేవస్థానం పేరుమీద డీడీ తీసి పంపవచ్చన్నారు. వివరాలకు 9494289008 నంబరులో సంప్రదించాలని కోరారు.

బీసీల బలం చూపిద్దాం

పల్నాడులో త్వరలో జరిగే యుద్ధానికి 'సిద్ధం' కండి

- ముఖ్యమంత్రి కోసం ప్రాణాలైనా ఇస్తా
- నరసరావుపేట లోక్‌సభ పరిధిలో 7 నియోజకవర్గాల గెలుపే లక్ష్యం
- ఎన్నికలకు ఇక 55 రోజులే.. విభేదాలు పక్కన పెట్టి కలసికట్టుగా నడుద్దాం
- వైఎస్సార్ సీపీ నరసరావుపేట లోక్‌సభ సమన్వయకర్త అనిల్‌కుమార్ యాదవ్
- వినుకొండలో పార్టీ శ్రేణుల పరిచయ కార్యక్రమానికి హాజరైన అనిల్‌కుమార్ యాదవ్
- భారీ బహిరంగసభకు 25వేలకు పైగా తరలివచ్చిన అభిమానులు



బహిరంగసభలో మాట్లాడుతున్న అనిల్‌కుమార్ యాదవ్, వేదికపై వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తదితరులు

వినుకొండ(నూజెండ్ల): బీసీల బలం నిరూపించాల్సిన తరుణం ఆసన్నమైందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నరసరావుపేట లోక్‌సభ సమన్వయకర్త అనిల్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు. వినుకొండలో మంగళ వారం జరిగిన పార్టీ నాయకుల, కార్యకర్తల పరిచయ కార్యక్రమంలో అనిల్‌కుమార్‌యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పల్నాడు రోడ్డులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వేలాది మంది అభిమానులు, కార్యకర్తలనుద్దేశించి ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నరసరావుపేట లోక్‌సభకు పోటీ చేస్తున్నట్లు చెప్పారు. గతంలో నెల్లూరు నుంచి నరసరావుపేటకు పోటీచేసిన మేకపాటి రాజమోహన్‌రెడ్డి లాగే తనను ఆశీర్వదించాలని కోరారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. మంత్రులుగా, ఎంపీలుగా, ఎమ్మెల్యేలుగా, వారికి సముచిత స్థానం కల్పించారన్నారు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన నాటినుంచి ఏ పార్టీ నరసరావుపేట ఎంపీ స్థానంలో బీసీలకు అవకాశం ఇవ్వలేదని, తొలిసారిగా తనకు సీఎం జగన్ అవకాశం కల్పించారన్నారు. తనను గెలిపిస్తే మొట్టమొదటి బీసీ ఎంపీగా రికార్డు సృష్టిస్తానన్నారు. అలాగే పార్లమెంటు పరిధిలోని ఏడుగురు ఎమ్మెల్యేలను గెలిపించాలని పిలుపునిచ్చారు.

భోళా శంకరుడు బొల్లా బ్రహ్మనాయుడు ..

వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కల్మషం లేని భోళా శంకరుడని, వినుకొండ అభివృద్ధిలో ఆయన చూపిన చొరవ మరువలేనిదన్నారు. ఎమ్మెల్యే బొల్లాను అఖండ మెజార్టీతో గెలిపించాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో ప్రతి గ్రామంలో కార్యకర్తలను, అభిమానులను కలుస్తానన్నారు.

చంద్రబాబు మాయలో పడవద్దు..

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు మాయమాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ పేరుతో మళ్లీ ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమయ్యారని, చంద్రబాబు పాలనలో ఒక్కటైనా చెప్పుకోదగిన పనిచేశారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో చంద్రబాబుకు ఇల్లు కూడా లేదని, అలాంటి వ్యక్తిని నమ్మి మోసపోవద్దన్నారు. మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పదేళ్లు ఎమ్మెల్యేగా ఉండి చేసిందేమీ లేదన్నారు. తాము చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. త్వరలో వినుకొండలో హార్టికల్చర్ కళాశాలతో పాటు తిరుమల ఇంజినీరింగ్ కాలేజీ ఏర్పాటు చేస్తామని, విద్యతో పాటు అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు.

మహానేత వైఎస్సార్ విగ్రహావిష్కరణ...

పట్టణంలోని చెక్‌పోస్టు సెంటర్ వద్ద దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుతో కలిసి అనిల్‌కుమార్ యాదవ్ ఆవిష్కరించారు. మహానేత స్ఫూర్తితో పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మహానేత వైఎస్సార్ విగ్రహావిష్కరణలో అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే బొల్లా

ఇక్కడే స్థిరనివాసం ..

తనకు అవకాశం ఇస్తే నరసరావుపేటలో ఇల్లు కట్టుకొని మీ మధ్యనే ఉంటానని అన్నారు. కల్మషం, కుళ్లు, కుతంత్రాలు లేని నాయకుడిగా మీ మధ్యలోనే ఉంటానని అన్నారు. ఎన్నికలకు 55 రోజులు మాత్రమే సమయం ఉందని, అభిప్రాయ భేదాలు పక్కన పెట్టి అందరూ కలిసిగట్టుగా పార్టీని గెలిపించాలని కోరారు. తొలిసారిగా వినుకొండకు వచ్చిన తనపై పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు చూపిన ఆదరణ మరచిపోలేనని, తనను గెలిపిస్తే వినుకొండ నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. త్వరలో పల్నాడు యుద్ధం తరహాలో సిద్ధం సభ జరగబోతుందని, పల్నాడు ప్రజలు విజయవంతం చేయాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనలేక రాష్ట్రంలోని ఐదు పార్టీలు ఒక్కటై వస్తున్నాయని, రాముడికి హనుమంతుడిలాగా సీఎం జగన్ వెంటే తాను నడుస్తానని, అవసరమైతే సీఎం జగన్ కోసం ప్రాణాలైనా అర్పిస్తానన్నారు.

25 మినరల్ వాటర్ ప్లాంట్లకు నోటీసులు



వాటర్ ప్లాంట్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేస్తున్న ప్రజారోగ్య అధికారులు

నెహ్రూనగర్: నిర్దేశిత నిబంధనలు పాటించని మినరల్ వాటర్ ప్లాంట్లపై కఠిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. నగర కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం ప్రజారోగ్య అధికారులు నగరంలోని శారదాకాలని, శ్రీనగర్, బొంగరాల బీడు, ఐపీడీ కాలనీ, సంగడి గుంట, నల్లచెరువు మెయిన్ రోడ్ ప్రాంతాల్లోని 25 మినరల్ వాటర్ ప్లాంట్‌లకు నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో పలు ప్రాంతాల్లో నిర్దేశిత ప్రమాణాలు పాటించకుండా, ప్రజారోగ్యానికి భంగం కల్గించేలా మినరల్ వాటర్ ప్లాంట్‌లు నిర్వహిస్తున్నారని రీజినల్ ల్యాబ్ నివేదిక ఇచ్చిందన్నారు. ఇప్పటికే సోమవారం 6 ప్లాంట్‌లను సీజ్ చేశామని తెలిపారు. ఆయా ప్లాంట్‌ల నుంచి విక్రయిస్తున్న నీటిలో పీహెచ్ లెవల్స్ నిబంధనల మేరకు నిర్వహించడం లేదని, ప్రమాదకర క్లేబిసిల్లా బ్యాక్టీరియాని కూడా గుర్తించినట్లు ల్యాబ్ రిపోర్ట్ అందిందన్నారు. ప్లాంట్‌ల నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, లేకుంటే సీజ్ చేయక తప్పదని హెచ్చరించారు. ప్రజలు కూడా నిర్దేశిత ప్రమాణాలు లేని ప్లాంట్‌ల నుంచి నీటిని కొనుగోలు చేయవద్దని కోరారు. వార్డు సచివాలయాల వారీగా నగరంలోని మినరల్ వాటర్ ప్లాంట్‌లకు అనుమతులు, ల్యాబ్ రిపోర్ట్‌లను చూపాలని కోరుతూ నోటీసులు జారీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీఎంఓహెచ్ డాక్టర్ ఆశా, ఎంహెచ్ఓ మధుసూదన్, ఎస్ఎస్ రాంబాబు, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు అంగడి వెంకటేశ్వర్లు, భవాని బాబు, ఐజాక్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎస్సీల జీవితాల్లో వెలుగులు

- బడుగు, బలహీన వర్గాలే వైఎస్సార్ సీపీకి బలం
- మీరు ముందుండి నన్ను నడిపించండి
- చిలకలూరిపేట యార్డు చరిత్రలో తొలిసారి ఎస్సీకి ఛైర్మన్ పదవి ఇచ్చాం
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- పార్టీ ఎస్సీ విభాగం నేతలతో ప్రత్యేక సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రజిని

పట్నంబజారు: బడుగు, బలహీనవర్గాల బతుకుల్లో వెలుగులు నింపి, వారిని కంటికిరెప్పలా చూసుకునే గొప్ప నాయకుడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. గుంటూరు చంద్రమౌళినగర్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం పార్టీ ఎస్సీ విభాగం నేతలతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ తమ నాయకుడని సగర్వంగా చెప్పుకునేలా.. పరిపాలన సాగిస్తున్నారని కొనియాడారు. ప్రజల ఆశీస్సులతో పుట్టిన వైఎస్సార్ సీపీని ఎప్పటికీ ఏ ఒక్కరూ ప్రజల నుంచి వేరు చేయలేరని స్పష్టం చేశారు. ఎన్నో సంక్షేమ పథకాల ద్వారా బడుగు, బలహీనవర్గాల వారు ఆర్థికంగా ఎదిగేలా సీఎం జగన్ కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరికీ కనీస అవసరాలైన ఇల్లు, నాణ్యమైన విద్య, వైద్యం.. ఇవన్నీ ఉచితంగా అందేలా చేస్తున్న గొప్ప ప్రభుత్వం తమదన్నారు. నేడు రాష్ట్రంలో పేదలంతా ఎలాంటి భయాందోళనలు లేకుండా, ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా సంతోషంగా జీవిస్తున్నారని, అందుకు తమ ప్రభుత్వ విధానాలే కారణమన్నారు.

పశ్చిమలో గెలుపే లక్ష్యం కావాలి..

గడిచిన రెండు ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గంలో పార్టీ విజయం సాధించలేకపోయిందని, అందుకు గల కారణాలను అన్వేషించాల్సిన అవసరం ఉందన్నారు. లోపాలను సరి చేసుకుంటూ.. సమస్యలను పరిష్కరించుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఎట్టి పరిస్థితుల్లో వచ్చే ఎన్నికల్లో గుంటూరు పశ్చిమ లో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయాలన్నారు. వైఎస్సార్ సీపీ మరోసారి గెలిస్తే బడుగు, బలహీనవర్గాలకు మరింత మేలు చేకూరుతుందన్నారు.

ఎస్సీలకు అండలం...

చిలకలూరిపేట చరిత్రలో తొలిసారి ఒక బీసీ మహిళనైన తనను పోటీలో నిలిపిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. ఒక బీసీ మహిళగా తాను పోటీ చేస్తే.. బీసీలు, ఎస్సీలు అంతా తామే పోటీ చేసినట్లుగా భావించి కష్టపడి పనిచేసి గెలిపించారని గుర్తు చేసుకున్నారు. వారి కష్టం వృథా కాకూడదనే లక్ష్యంతో తాను పనిచేశానన్నారు. చిలకలూరిపేట మార్కెట్ యార్డు చరిత్రలో తొలిసారి ఎస్సీలను ఛైర్మన్లు చేశామని, వరుసగా రెండు సార్లు ఇద్దరు ఎస్సీలను మార్కెట్ యార్డు ఛైర్మన్ పీఠంపై కూర్చోబెట్టామంటే అది జగనన్న పరిపాలనా సంస్కరణల వల్లే సాధ్యమైందన్నారు. గుంటూరులోనూ బీసీలు, ఎస్సీలు గొప్పగా తలెత్తుకుని తిరిగేలా పనిచేస్తానన్నారు. చిలకలూరిపేట పట్టణం నడిబొడ్డున అంబేద్కర్ విగ్రహాన్ని సొంత ఖర్చుతో ఏర్పాటు చేశామన్నారు. జీడీసీసీ బ్యాంకు ఛైర్మన్, పశ్చిమ నియోజకవర్గ పరిశీలకులు రాతంశెట్టి సీతారామాంజనేయులు, జిల్లా గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ బత్తుల దేవానంద్, కార్పొరేటర్లు బోడపాటి ఉషారాణి, కిషోర్, అందుగుల సంతోష్, గురవయ్య, ఈచంపాటి వెంకటకృష్ణాచారి, గేదెల రమేష్, మార్కెట్ బాబు, యోగేశ్వరరావు, ఐటీ విభాగం అధ్యక్షుడు మాదాసు కిరణ్, మహిళా విభాగం అధ్యక్షురాలు గనిక ఝాన్సీ, యార్డ్ డైరెక్టర్ ప్రభు, ఎస్సీ నాయకులు పాల్గొన్నారు.

ఇళ్ల రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: నవరత్నాలు – సంక్షేమ పథకాల్లో భాగంగా పేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మరింత వేగంగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నుంచి అధికారులతో వర్చువల్ విధానంలో కలెక్టర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మందకొడిగా సాగుతుందన్నారు. లోపాలు సరిచేసుకుని ముందుకు వెళ్లాలన్నారు. తెనాలి, పొన్నూరు మున్సిపాలిటీల్లో వెంటనే పూర్తి చేయాలన్నారు. ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్న స్థలాల హద్దుల మ్యాపింగ్, సర్వే, టౌన్ ప్లానింగ్ అధికారులు పూర్తి చేయాలన్నారు. తప్పుల సవరణకు సంబంధించి వివరాలను నిర్దేశించిన మాడ్యూల్‌లో అప్‌లోడ్ చేసిన వెంటనే సరిచేసి రిజిస్ట్రేషన్లు చేయించాలన్నారు. ఈ నెల 23న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రిజిస్ట్రేషన్ పట్టాలు పంపిణీ చేయనున్నారన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని రిజిస్ట్రేషన్ ప్రక్రియ యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. అలసత్వం వహించే సచివాలయ సిబ్బందిపై చర్యలు తప్పవన్నారు.



పేదింటి పెళ్లికి జగనన్న భరోసా

- జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి
- వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా కింద 303 మందికి రూ.2.75కోట్లు
- హర్షం వ్యక్తం చేసిన నవ దంపతులు



నూతన దంపతులకు షాదీతోఫా, కల్యాణమస్తు చెక్కు అందజేస్తున్న జెడ్పీ ఛైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, మేయర్ కావటి మనోహర్ తదితరులు

గుంటూరు వెస్ట్: పేదింట వివాహాలు ఎంత కష్టతరమో స్వయంగా పాదయాత్ర ద్వారా చూసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వారికి ఆర్థిక భరోసా కల్పించే దిశగా విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టారని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా 5వ విడత నగదును బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేశారు. ఈ కార్యక్రమానికి వర్చువల్ విధానంలో స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ క్రమం తప్పకుండా ఐదవ విడత నిధులను లబ్ధిదారుల ఖాతాల్లో ముఖ్యమంత్రి నేరుగా జమ చేశారన్నారు. దీని ద్వారా జిల్లాలో 303 నూతన జంటలకు రూ.2.75 కోట్లు అందాయన్నారు. ఎవరికైనా అందకపోతే సమీపంలోని సచివాలయాల్లో మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇప్పటివరకు ఈ పథకం ద్వారా జిల్లాలో 1297 జంటలకు రూ.11.65 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్, జడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మందపాటి శేషగిరిరావు, కృష్ణ బలిజ, పూసల కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ కోలా భవాని మణికంఠ, వృద్ధులు, వికలాంగుల కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్, మార్కెట్ యార్డు ఛైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, నెడ్‌క్యాప్ డైరెక్టర్ కొత్త చిన్నపరెడ్డి లబ్ధిదారులకు నమూనా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూధనరావు, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, అధికారులు పాల్గొన్నారు.

చాలా సహాయంగా ఉన్నాయి..

ప్రభుత్వం మా వివాహానికి అందించిన రూ.లక్ష చాలా ఉపయోగపడతాయి. ముఖ్యంగా పెళ్లి ఖర్చు చాలా వరకు తగ్గించుకున్నాం. ఈ మొత్తాన్ని సద్వినియోగం చేసుకుంటాం. పేద వారి కుటుంబాల్లో వివాహమంటే ఎంతో భారంతో కూడుకున్నది. ఇప్పుడు మా జగనన్న ఉన్నాడు గనుక ఆ ఇబ్బంది ఉండదు. ఆయన రుణం తీర్చుకుంటాం.

– గౌస్, కరిష్మా, గుంటూరు

అద్భుతమైన పథకం..

సచివాలయంలో దరఖాస్తు చేసుకోగానే వలంటీర్ వచ్చి విచారించారు. ఎక్కడా ఒక్క రూపాయి లంచం ఇవ్వకుండా డబ్బులు అందాయి. ఈ పథకం ఒక అద్భుతమనే చెప్పాలి. ఇదొక్కటే కాదు మాకు అందుతున్న ఏ పథకంలోనూ లంచాలు లేవు. మా భవిష్యత్తును అందంగా తీర్చిదిద్దుకునేందుకు ఈ డబ్బులు కొంత ఉపయోగపడతాయి.

– చందు, అనిత, గుంటూరు

క్లుప్తంగా

స్టేషనరీకి టెండర్లు వేయండి

గుంటూరు వెస్ట్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఒక పార్లమెంట్, ఏడు నియోజకవర్గాలకు సంబంధించి అవసరమైన స్టేషనరీ సరఫరా కోసం సీల్డ్ కవర్ టెండర్‌లు వేయాలని జిల్లా కలెక్టర్ కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. వివరాలకు 98499 04005 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

వేజండ్ల కాయర్ ఇండస్ట్రీలో అగ్ని ప్రమాదం



వేజండ్ల(చేబ్రోలు): మండలంలోని వేజండ్ల గ్రామంలోని కాయర్ అండ్ కాయర్ రోప్ ఇండస్ట్రీలో మంగళవారం విద్యుదాఘాతమై భారీ ఆస్తి నష్టం జరిగింది. గత ఏడాది కాయర్ అండ్ కాయర్ రోప్ ఇండస్ట్రీను వంగా నవ్య నిర్మించారు. అయితే మంగళవారం తెల్లవారుజామున విద్యుదాఘాతంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించి పరిశ్రమలోని యంత్ర సామగ్రి, మెటీరియల్ కాలిబూడిదయ్యాయి. ఎగుమతికి సిద్ధంగా ఉన్న మూడు లారీల కొబ్బరితాళ్లు, నాలుగు లారీల కొబ్బరిపీచు, ఇతర సామగ్రి దగ్ధమయ్యాయి. విలువైన యంత్ర పరికరాలు కాలిపోయాయి. గుంటూరు అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. జరిగిన ఘటనపై యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు

జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేశ్వరరావు



గురజాల: విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.నాగేశ్వరరావు హెచ్చరించారు. స్థానిక పంచాయతీ రాజ్ బంగ్లాలో గురజాల, మాచర్ల నియోజకవర్గాల్లో ఏపీఎస్‌బీసీఎల్ నందు పనిచేస్తున్న సూపర్ వైజర్లు, సేల్స్‌మెన్‌లకు అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ఉండాలన్నారు. మద్యం దుకాణాల నిర్వహణతో పాటు రికార్డుల నిర్వహణపై అవగాహన కల్పించారు. మద్యం దుకాణంలో మద్యాన్ని నిర్దేశించిన ధరలకు మాత్రమే విక్రయించాలన్నారు. ప్రధానంగా సమయ పాలన పాటించాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహించరాదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ బుజ్జిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని కోల్డ్ స్టోరేజీలపై చర్యలు

కర్మాగారాల శాఖ జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రావు



మాట్లాడుతున్న కర్మాగారాల శాఖ జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రావు

కొరిటెపాడు(గుంటూరు): కోల్డ్ స్టోరేజీల నిర్వాహకులు అగ్నిప్రమాదాలు నివారించడానికి విధిగా నిబంధనలు పాటించాలని, నిబంధనలు పాటించని కోల్డ్ స్టోరేజీలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కర్మాగారాల శాఖ జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రావు హెచ్చరించారు. కోల్డ్ స్టోరేజీలలో భద్రతపై కర్మాగారాల శాఖ ఆధ్వర్యంలో జీటీ రోడ్‌లోని ఇండియన్ టుబాకో అసోసియేషన్(ఐటీఏ) సమావేశ మందిరంలో ఉమ్మడి గుంటూరు జిల్లా కోల్డ్‌స్టోరేజీల యాజమాన్యంతో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మోహన్‌రావు మాట్లాడుతూ సాంకేతిక లోపాలు వల్ల సరైన నిర్వహణ లేకపోవడం, అనుభవం లేనివారు ప్లాంట్ రూములో కంప్రెషర్ నడపడంతో ప్రమాదవశాత్తూ అమ్మోనియా లీకులు జరగడం, అగ్నిప్రమాదాలు జరగడం వింటున్నామని వెల్లడించారు. నిర్మాణంలో లోపాలు, ప్రమాద నివారణ విధానాలు పాటించకపోవడం వల్ల నాణ్యత లేని పరికరాలు వాడడం వల్ల అగ్నిప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. నమ్మకమైన ప్రమాద నివారణ పద్ధతులు అవలంభించి, నేర్పు, శిక్షణ గల వారు ప్లాంటులు నడిపితే ప్రమాదాలు నివారించవచ్చని సూచించారు. కర్మాగారాల శాఖ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఎం.వీ.శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో సుమారు వందకు పైగా కోల్డ్‌స్టోరేజీలు ఉన్నాయని, వీటిలో ఎక్కువగా మిరపకాయలు నిల్వ చేస్తుంటారని వెల్లడించారు. అమ్మోనియాను చల్లబరిచే రసాయనంగా ఉపయోగిస్తూ కోల్డ్‌స్టోరేజీలు పనిచేస్తున్నాయని తెలిపారు. కోల్డ్‌స్టోరేజీలలో జరుగుతున్న అగ్ని ప్రమాదాలకు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అగ్నిమాపకశాఖ జిల్లా అధికారి ఎం.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కొన్ని శీతల గిడ్డంగుల నిర్వాహకులు అగ్నిమాపక శాఖ సూచనలను బేఖాతరు చేస్తున్నారని, తప్పనిసరిగా అగ్ని ప్రమాదాలను నిలువరించే ముందస్తు పరికరాలను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. ఫైర్ సర్వీసు యాక్టు నిబంధనలు పాటించాలన్నారు. ప్రస్తుత వేసవి కాలంలో ఎలాంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. సదస్సులో ఫైర్ అధికారి కృష్ణారెడ్డి, కర్మాగారాల శాఖ అధికారి రాంబాబు, కోల్డ్‌స్టోరేజీల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రకాశరావు, సురేంద్రబాబు, ఉమ్మడి గుంటూరు జిల్లాలోని కోల్డ్‌స్టోరేజీల ప్రతినిధులు పాల్గొన్నారు.

స్పష్టమైన భావ వ్యక్తీకరణ అంబేడ్కర్ నైజం

సఫాయీ కర్మచారీ ఆందోళన్ జాతీయ కన్వీనర్ బెజవాడ విల్సన్



ప్రసంగిస్తున్న బెజవాడ విల్సన్, వేదికపై వీసీ ఆచార్య పి రాజశేఖర్

ఏఎన్‌యూ: ఏ అంశం గురించైనా తటపటాయించకుండా స్పష్టమైన భావాన్ని వ్యక్తీకరించడం అంబేడ్కర్ నైజమని సఫాయీ కర్మచారీ ఆందోళన్ జాతీయ కన్వీనర్ బెజవాడ విల్సన్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంబేడ్కర్ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో 'డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనా విధానం, ఆర్థికాభివృద్ధి, దేశ నిర్మాణం' అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సు మంగళవారం ప్రారంభమైంది. ప్రారంభోత్సవ సభలో విల్సన్ కీలకోపన్యాసం చేస్తూ అంబేడ్కర్‌వాదులు కూడా ఏ విషయంలోనైనా స్పష్టమైన అభిప్రాయం కలిగి ఉండాలన్నారు. అంబేడ్కర్ రాజ్యాంగ సభల్లో చేసిన ప్రసంగాలు పరిశీలిస్తే ఆయనలోని దృఢమైన వ్యక్తిత్వం తెలుస్తుందన్నారు. అంబేడ్కర్ వ్యక్తిత్వాన్ని, వాదాన్ని విస్మరించడమంటే జాతిని విస్మరించడమేనన్నారు. అంబేడ్కర్ తత్వం అనుసరిస్తేనే దేశానికి, జాతికి సరైన దిశానిర్దేశం చేయగలుగుతామని తెలిపారు. నేటికీ మన దేశంలో ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్, జమ్మూ కాశ్మీర్ వంటి రాష్ట్రాల్లో నేటికీ దళిత మహిళలు తమ చేతులతో మలాన్ని ఎత్తి నెత్తిమీద పెట్టుకుని దానిని విసర్జిత ప్రాంతాల్లో పడేసి వచ్చే పని చేయాల్సి రావడం విచారకరమన్నారు. గత తొమ్మిది సంవత్సరాల్లో దేశ వ్యాప్తంగా సంపన్నులు బ్యాంకుల్లో చేసిన రూ.14.36 లక్షల కోట్లు మొండి బకాయిలను రద్దు చేసిన ప్రభుత్వాలు సఫాయీ కర్మచారీల కోసం సంవత్సరానికి కేటాయించే రూ. 570 కోట్ల బడ్జెట్‌ను సున్నాకు తగ్గించడం దురదృష్టకరమన్నారు. ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి రాజశేఖర్ ప్రసంగిస్తూ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పేదల ఆర్థికాభివృద్ధి, జాతి అభివృద్ధి నేటికీ జరగలేదన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏపీ ప్రభుత్వం విజయవాడలో ఏర్పాటు చేయడం ఆదర్శనీయమన్నారు. సదస్సు డైరెక్టర్ ఆచార్య వై అశోక్‌కుమార్ అధ్యయన కేంద్రం అభివృద్ధిని, సదస్సు నిర్వహణ ఉద్దేశాన్ని వివరించారు. సదస్సు కోశాధికారి డాక్టర్ కె అబ్రహాం లింకన్, హైదరాబాద్ మనూ(మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ) అధ్యాపకులు ఆచార్య జీవీ రత్నాకర్, పలువురు అధికారులు, అధ్యాపకులు ప్రసంగించారు. పరిశోధకులు, విద్యార్థులు, అంబేడ్కర్‌వాదులు పాల్గొన్నారు.

వికలాంగుల సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



నెహ్రూనగర్: రాష్ట్రంలో వికలాంగుల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం జేకేసీ కాలేజీ రోడ్డులో ఓ ఫంక్షన్ హాలులో వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమావేశంలో సమితి రాష్ట్ర అధ్యక్షుడు చినసుబ్బయ్య, అందె రాంబాబు, రమేష్, సురేష్, కిరణ్ పాల్గొన్నారు.

యువకుడి బలవన్మరణం



అద్దంకి రూరల్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ యువకుడు ఉరేసుకొని బలవన్మరణం చెందాడు. ఈఘటన మండలంలోని వెంపరాల గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని వెంపరాల గ్రామానికి చెందిన అంకమ్మరావు (35) కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. ఈనేపథ్యంలో ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరి వేసుకున్నాడు. స్థానికులు 108కు సమాచారం అందించారు. వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అంకమ్మరావు మృతికి గల కారణాలు తెలియలేదు.

దూరవిద్య డిగ్రీ ప్రవేశ గడువు పొడిగింపు

గుంటూరు ఎడ్యుకేషన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయ ఆధ్వర్యంలో బీఏ, బీకాం, బీఎస్సీ, ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ కోర్సుల్లో ప్రవేశం పొందుటకు ఈనెల 15న ముగిసిన గడువును ఈనెల 29వ తేదీ వరకు పొడిగించినట్లు జేకేసీ కళాశాల క్యాంపస్‌లోని వర్శిటీ స్టడీ సెంటర్ ప్రాంతీయ సమన్వయకర్త పి.గోపీచంద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అదే విధంగా రూ.200 అపరాధ రుసుంతో కలిపి అడ్మిషన్ ఫీజు చెల్లించేందుకు ఈనెల 31వ వరకు అవకాశమున్నట్లు తెలిపారు. వివరాలకు 0863-2227950, 73829 29605 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

గొట్టిపాడు పంచాయతీలో నిధుల దుర్వినియోగం

- రెండోసారి సర్పంచ్ చెక్‌పవర్‌ను తాత్కాలికంగా నిలిపివేసిన ఉన్నతాధికారులు
- 15 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని సర్పంచ్‌కు షోకాజ్ నోటీసు

పెదగొట్టిపాడు (ప్రత్తిపాడు): టీడీపీ గ్రామ పంచాయతీలో నిధులు దుర్వినియోగమవడంతో సర్పంచ్ చెక్ పవర్‌ను రెండవసారి కూడా అధికారులు నిలిపివేశారు. ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడు గ్రామ పంచాయతీలో పెద్ద ఎత్తున నిధులు దుర్వినియోగం అయ్యాయంటూ అదే పంచాయతీకి చెందిన ఉపసర్పంచ్ నిమ్మగడ్డ ముకుంద శివరంజని గత ఏడాది ఫిబ్రవరిలో జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అప్పట్లో జరిగిన శాఖాపరమైన విచారణలో నిధులు దుర్వినియోగమైనట్లు అధికారులు నిర్ధారించడంతో జిల్లా కలెక్టర్ సర్పంచ్ చెక్ పవర్‌ను మూడు నెలల పాటు తాత్కాలికంగా రద్దు చేస్తూ ఉత్తర్వులిచ్చారు. అంతేకాకుండా ఒక గ్రేడ్-4 సెక్రటరీని సస్పెండ్ చేయడంతో పాటు మరో ఇద్దరు గ్రేడ్-1 సెక్రటరీల సస్పెన్షన్‌కు ఆ శాఖ కమిషనర్‌కు సిఫారసు చేశారు. అయితే సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేసే అధికారం కలెక్టర్‌కు లేదంటూ గ్రామ సర్పంచ్ ప్రత్తిపాటి మరియరాణి హైకోర్టును ఆశ్రయించడంతో ఆమెకు ఉపశమనం లభించింది. అయితే తాజాగా కొద్దిరోజుల కిందట 14, 15వ ఆర్థిక సంఘం నిధులు లక్షల్లో దుర్వినియోగం చేశారంటూ ఉపసర్పంచ్ శివరంజని ఆమె భర్త శ్రీకాంత్‌లు ప్రత్తిపాడులోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట బైఠాయించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్పందించిన డీపీవో శ్రీదేవి కచ్చితంగా రికార్డులను పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆ వెంటనే పంచాయతీలో ఉన్న రికార్డులను ఈవోపీఆర్డీతో తెప్పించుకుని వాటి సీజ్ చేశారు. ఈ నేపథ్యంలో నిధుల విత్ డ్రాకు సంబంధించి కొన్నింటికి బిల్లులు లేకపోవడంతో పాటు గతంలో కూడా నిధులు దుర్వినియోగం జరిగిన వాటికి సంబంధించి సర్పంచ్ చెక్ పవర్‌ను తాత్కాలికంగా నిలిపివేయడంతో పాటు ఎందుకు చర్యలు తీసుకోకూడదో తెలియజేయాలంటూ సర్పంచ్‌కు షోకాజ్ నోటీసును డీపీవో శ్రీదేవి జారీచేశారు. దీంతో రెండవ సారి కూడా సర్పంచ్ చెక్ పవర్ రద్దయ్యింది.

ఈ విషయమై డీపీవో కె. శ్రీదేవిని 'సాక్షి' వివరణ కోరగా గతంలోనూ, ప్రస్తుతం కూడా విత్ డ్రా చేసిన నగదుకు సంబంధించిన బిల్లులు, రసీదులు సక్రమంగా లేవన్నారు. అందుచేత తాత్కాలికంగా చెక్ పవర్‌ను రద్దు చేసి, షోకాజ్ జారీచేశామని తెలిపారు.

టెన్త్‌లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

మోడల్ స్కూల్స్ కార్యదర్శి వెంకట కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న వెంకట కృష్ణారెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: టెన్త్ పరీక్షల్లో మోడల్ హైస్కూళ్ల పరిధిలో నూరు శాతం ఉత్తీర్ణత నమోదు కావాలని మోడల్ స్కూల్స్ కార్యదర్శి ఎం.వెంకట కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పాత బస్టాండ్ సెంటర్లోని జిల్లా పరీక్ష భవన్‌లో మోడల్ స్కూల్స్ ప్రిన్సిపాల్స్, హెచ్‌ఎంలతో జోనల్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకట కృష్ణారెడ్డి మాట్లాడుతూ పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు వ్యవధి తక్కువగా ఉన్న నేపథ్యంలో విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ చూపాలని సూచించారు. విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇవ్వడం ద్వారా పరీక్షలపై అర్థం లేని భయం, ఆందోళనను దూరం చేయవచ్చునని సూచించారు. ఒత్తిడి లేని వాతావరణంలో పరీక్షలకు హాజరయ్యే విధంగా చూడాలని సూచించారు. ప్రతిరోజూ ఉదయం ,సాయంత్రం ప్రత్యేక తరగతుల నిర్వహణతో పాటు విద్యార్థులకు స్ఫూర్తిదాయకమైన విషయాలను చెప్పి, ప్రేరణ కల్పించాలన్నారు. ప్రతిరోజు ప్రతి సబ్జెక్టులో లఘు పరీక్ష నిర్వహించి, అదేరోజు మూల్యాంకనం జరపాలన్నారు. ఫలితాలపై విశ్లేషణ చేసి, విద్యార్థులందరూ ఉత్తీర్ణులయ్యే విధంగా పర్యవేక్షించాలని, గణితం, సైన్స్ సబ్జెక్టులపై ఎక్కువగా దృష్టి కేంద్రీకరించాలన్నారు. సమావేశంలో ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి, ఏపీ మోడల్ స్కూల్స్ ఏఎంవో శ్రీలత, శరత్‌బాబు, ధర్మకుమార్ పాల్గొన్నారు.

సినిమాటోగ్రఫీ చట్టం ముసాయిదా బిల్లుపై అభ్యంతరం

- తగిన మార్పులు చేయకుంటే పరిశ్రమకు నష్టం
- కేంద్ర ప్రభుత్వం పునఃపరిశీలన చేయాలి
- మా-ఏపీ వ్యవస్థాపకుడు, సినీదర్శకుడు దిలీప్‌రాజా



తెనాలి: సినిమాటోగ్రఫీ చట్టం 1952 సవరణకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ముసాయిదా బిల్లు లోప భూయిష్టమని, మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (మా-ఏపీ) దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు మా-ఏపీ వ్యవస్థాపకుడు, సినీదర్శకుడు దిలీప్‌రాజా అన్నారు. సంస్థ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ముసాయిదా బిల్లులోని అంశాలు భావప్రకటన స్వేచ్ఛకు, ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీసేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా గల సినిమా సంఘాలు కూడా ముసాయిదా బిల్లును పరిశీలించి, వ్యతిరేకించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. యూట్యూబ్, ఓటీటీల్లో విపరీతంగా వస్తున్న నగ్న దృశ్యాలను కత్తిరించకుండా, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) ఇచ్చిన సెన్సార్ సర్టిఫికెట్‌ను తిరిగి సమీక్షించటం ఏమిటని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మరోవైపు సెల్‌ఫోన్లలో అందుబాటులోకి వచ్చిన సాంకేతికతను ఉపయోగించుకుంటూ కేటుగాళ్లు, మోసగాళ్లు ఎందరో అమాయకులను నిలువు దోపిడీ చేస్తున్నట్టు గుర్తుచేశారు. సైబర్ నేరాలను మరింత కఠినంగా అరికట్టటం, ఓటీటీల్లో నగ్న దృశ్యాలకు కట్ చెప్పటం వంటి పురోగమన చర్యలను కేంద్ర ప్రభుత్వం చేపట్టాలని అభిప్రాయపడ్డారు. అలాకాకుండా కేవలం సీబీఎఫ్‌సీ సెన్సార్ సర్టిఫికెట్ ఇచ్చాక కేంద్ర ప్రభుత్వం మళ్లీ సమీక్షిస్తే సినిమా నిర్మాతలకు నష్టదాయకంగా ఉంటుందని చెప్పా రు. కేంద్ర ప్రభుత్వం తగిన మార్పులు చేయాలని కోరుతూ సంబంధిత మంత్రికి లేఖ రాసినట్టు వివరించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ వినుకొండ టౌన్ దగ్గరలో తారురోడ్డు ప్రక్కనే ఎర్రచందనం మొక్కలతో 30 అడుగుల రోడ్లు ఇచ్చిన ప్లాట్స్ సెంట్ కేవలం 75000 మాత్రమే. 9059440723

■ అమరావతిరోడ్డు ఢిల్లీ పబ్లిక్‌స్కూల్(లాం) ఎదురు వేగంగా నిర్మాణము జరుగుచున్న విల్లాస్ /ఓపెన్ ప్లాట్స్ వెంచర్‌లో E/W ఫేసింగ్ ప్లాట్స్ అమ్మకానికి కలవు. 63097 63997

LEASE

■ గుంటూరు పరిసర ప్రాంతాల్లో 4000 చ॥ అడుగులు గల భవనం విద్యాసంస్థ నిర్వహణ కోసం లీజుకు కావలెను. 8919555874, 8142431240

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299

■ బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 88024 89999

MARRIAGE SERVICES

వరుడు కావలెను

■ డైవోర్స్ : HIV 45సంవత్సరాలు వధువకునకు ఏ బాధలా బందీలేని రిచ్ వరుడు కావలెను. వివరాలకు వాట్సప్ పంపవలెను. 8688787780

WANTED

■ గుంటూరు, తెనాలి, రేపల్లె, బాపట్ల, చీరాల, చిలకలూరిపేట, నర్సరావుపేట, సత్తెనపల్లి బ్యాంకులలో పనిచేయుటకు యువతి/ యువకులు కావలెను. Qul: 7th-PG, Sal:18k-35k ✆ 9030740757

■ ఫిమేల్ హాస్టల్ ఇన్‌ఛార్జీలు కావలెను. జీతము: 10000/- నుండి 12000/- వరకు ఇవ్వబడును. భోజనం మరియు వసతి ఇవ్వబడును. మాస్టర్‌మైండ్స్, 3/11 బ్రాడీపేట, గుంటూరు. ఫోన్: 91000 24059

■ తక్కెళ్ళపాడు, సిబార్, హఫ్‌పేట పరిసర ప్రాంతాలలో పనిచేయుటకు సెక్యూరిటి గార్డ్స్ కావలెను. 12గం॥ డ్యూటీ, 2 సెలవులు, జీ: 12000/- సంప్ర: 6302252056, 7286909727

■ గుంటూరులో గల ప్రముఖ రియల్ ఎస్టేట్ ఆఫీసులో పనిచేయుటకు అకౌంటెంట్ (అ-ట్యాలీ+ ఒక సం॥ అనుభవం), ఆఫీస్‌బాయ్స్, సైట్ సూపర్ వైజర్స్ (M/F) కావలెను. సంప్ర: 9963784919

■ ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ నందు వర్క్ చేయుటకు డోర్‌టుడోర్ మార్కెటింగ్ టీమ్స్, మార్కెటింగ్ టీమ్‌లీడర్స్, లేడీ రిసెప్షనిస్ట్ కావలెను. సంప్ర: 9390963940

■ గుంటూరు పట్టాభిపురం మసీదు దగ్గర గల హ్యాపీ డెంటల్ క్లినిక్ నందు పనిచేయుటకు చైర్ అసిస్టెంట్ & PRO's (మార్కెటింగ్) కావలెను. ఫోన్: 9704370625, 7989218919

■ Ltd కంపెనీల్లో డేటాఎంట్రీ, రిసెప్షనిస్ట్, టెలికాలర్స్, సూ॥వైజర్స్, అకౌంటెంట్స్, ఆఫీస్ ఇన్‌ఛార్జెస్, మనీరికవరీ, ఆఫీస్‌బాయ్స్, హెల్పర్స్ Q:10th-PG,జీ:10-25వేలు. ఫోన్: 7993976590

■ GNTకాకానిరోడ్+అరండల్‌పేట+నగరంపాలెంలో వర్క్ చేయుటకు లేడీ టెలికాలర్స్+కన్వర్షేషన్, తెలుగు వ్రాయుటకు 60" కావలెను. స్పాట్ జాయినింగ్, P/T, F/T.జీ.8000-15000 ✆ 9865730288, 7780169458

■ గుంటూరు సిటీ ప్రముఖ వాచ్‌షాపులో పని చేయుటకు అనుభవం కలిగిన సేల్స్ గర్ల్స్ & బాయ్స్ కావలెను. సంప్ర॥ అరండల్‌పేట, 12వలైను, గుంటూరు ✆ 9966319743

■ గుంటూరులోని హోటల్ గ్రాండ్ నాగార్జున నందు లేడీస్ రిసెప్షనిస్ట్ అర్హత: డిగ్రీ, వెయిటర్స్, రూమ్ బాయ్స్, కిచెన్‌మాస్టర్స్ కావలెను. బ్రాడీపేట, మెయిన్‌రోడ్డు, గుంటూరు. 8143695977

■ ప్రముఖ సంస్థ నందు గుంటూరులో పని చేయుటకు స్త్రీ/పురుషులు & లేడి టెలికాలర్స్ కావలెను. అర్హత: 7th-డిగ్రీ(P/F), వ: 18-35సం॥ జీతం: 12-30వేలు. 8494578248, 8801227266

■ హాస్టల్ ఇన్‌చార్జ్‌లు, క్లాస్ ఇన్‌చార్జ్‌లుగా వర్క్ చేయుటకు పురుషులు కావలెను. జీతం: 10,000/- నుండి 12,000/- వరకు ఇవ్వబడును మరియు ఉచిత భోజనం, వసతి కల్పించబడును. విద్యార్హతలు: ఇంటర్, డిగ్రీ, వయస్సు: 23+, ఆసక్తి గల అభ్యర్థులు సంప్రదించగలరు. మాస్టర్ మైండ్స్. ఫోన్ : 8978480383

■ ప్రముఖ కంపెనీ పార్ట్ టైమ్ మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. డైలీ పేమెంట్స్ కలవు. మీ పేరు అడ్రస్ కాల్/వాట్సాప్ చేయగలరు. 98856 82589

■ మంగళగిరి, ఆత్మకూరు సమీపంలో రెస్టారెంట్‌కు హౌస్ కీపింగ్ లేడీస్ కావలెను. జీతం 11,000, వయస్సు 45 ఏళ్ల లోపు ఉండాలి, 8 గం॥ డ్యూటీ ✆ 62812 00949

■ వృద్ధులు, మంచంపట్టిన వారి పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్ హెల్పర్స్, ఆయాలు, కేర్ టేకర్స్ కావలెను. వసతి-భోజనం+మంచి జీతం. ✆ 91608 35559, 91600 25559

■ బాలాజీ గ్రూపు, (AP, న్యూ ఢిల్లీ No.1) శ్రీమంతుల ఇళ్ళలో వృద్ధులకు/పేషంట్ల సేవకు, ఇంటి / వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్ కావలెను. భో+వ.జీ: 16-18 వేలు, ఏజెంట్లకు 5వేలు కమీషన్ ✆ 6301053500, 9281452845

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573833520, 9059833520.

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18k ఫోన్. 9160900024 / 9640400073

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్
రూ. 475/- మాత్రమే (3 లైన్లు)
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ప్రతి ప్రకటనపై G.S.T. 5% అదనం
ఈ పేజీలో ప్రకటనల కొరకు సంప్రదించండి
గుంటూరు
7075167541
7075167663

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని స్వతంత్రంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నేటి నుంచి కబడ్డీ సందడి

- సత్తెనపల్లిలో అంతర్ జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు సిద్ధమవుతున్న క్రీడాకారులు
- రాష్ట్రవ్యాప్తంగా హాజరుకానున్న 26 బాల, బాలికల జట్లు
- వసతులు పరిశీలించిన మంత్రి అంబటి



కబడ్డీ పోటీలకు సిద్ధమైన వృందా కళాశాల మైదానం

సత్తెనపల్లి: 33వ ఆంధ్ర రాష్ట్ర సబ్ జూనియర్స్ అంతర్ జిల్లాస్థాయి బాల,బాలికల కబడ్డీ క్రీడా పోటీలకు పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని వృంద మహిళా జూనియర్ కళాశాల వేదిక కానుంది. నిత్యం పుస్తకాలు, ప్రయోగాలతో తీవ్ర ఒత్తిడితో ఉండే విద్యార్థులంతా పోటీల్లోనూ తమ సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నారు. ఆంధ్రప్రదేశ్ కబడ్డీ అసోసియేషన్ నేతృత్వంలో గుంటూరు జిల్లా కబడ్డీ అసోసియేషన్, సత్తెనపల్లిలోని వృంద మహిళా జూనియర్ కళాశాల, ప్రగతి జూనియర్, డిగ్రీ కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు మూడు రోజులపాటు జరగనున్న పోటీలకు క్రీడాకారులు సమాయత్తం అవుతున్నారు.

ఫ్లడ్‌లైట్ల వెలుతురులో ..

రాష్ట్రవ్యాప్తంగా 13 బాలుర, 13 బాలికల జట్లు హాజరుకానున్నాయి. ఒక్కో జట్టులో 12 మంది చొప్పున క్రీడాకారులు, ఒక కోచ్, ఒక మేనేజర్ మొత్తం 14 మంది ఉంటారు. 26 జట్లకు కలిపి 364 మంది హాజరుకానున్నారు. వీరితో పాటు 40 మంది టెక్నికల్ సిబ్బంది, నిర్వాహకులు హాజరవుతారు. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో జరిగే ఈ పోటీలు ఫ్లడ్‌లైట్ల వెలుతురులో మ్యాట్‌పై నిర్వహిస్తారు. ఇక్కడే ఆంధ్రప్రదేశ్ కబడ్డీ జట్టును కూడా ఎంపిక చేస్తారు. పోటీలను తిలకించేందుకు కూడా పెద్దఎత్తున క్రీడాభిమానులు హాజరుకానున్న నేపథ్యంలో మంగళవారం రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పట్టణంలోని వృంద మహిళా జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించారు. పోటీలు జరిగే వేదికను పరిశీలించి అనంతరం ఏర్పాట్లు, వసతులు అడిగి తెలుసుకున్నారు.

తొలుత క్రీడాకారులతో భారీ ర్యాలీ..

బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు పోటీలు ప్రారంభం కానున్నాయి. ఈ పోటీల ప్రారంభానికి ముందుగా క్రీడాకారులతో భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. పోటీలు ప్రారంభించేందుకు మంత్రి అంబటి రాంబాబుతో పాటు వైఎస్సార్ సీపీ నరసరావుపేట లోక్‌సభ సమన్వయకర్త డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్, జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, ఎస్పీ రవిశంకర్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. ఈ క్రమంలో పోటీల ఆర్గనైజింగ్ సెక్రటరీ, వృంద మహిళా జూనియర్ కళాశాల డైరెక్టర్ అనూష గంగారపు మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే కబడ్డీ పోటీలు వీక్షించేందుకు క్రీడాభిమానులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ నాయకుడు పక్కాల సూరిబాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగుర్ మీరాన్, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, ధూళిపాళ్ల ది ఆంధ్రాబ్యాంక్ రైతు సేవా సహకార సంఘం మాజీ చైర్మన్ తోట లక్ష్మీనారాయణ, నాయకులు లక్ష్మారెడ్డి, ఈపూరి బ్రహ్మారెడ్డి, కృష్ణారెడ్డి ఉన్నారు.

రేషన్ బియ్యం లారీ బోల్తా

భట్టిప్రోలు: అతివేగంగా బియ్యం లోడుతో వెళుతున్న లారీ ప్రమాదానికి గురై బోల్తా పడిన సంఘటన ఇది. వివరాల్లోకి వెళితే.. మచిలీపట్నం నుంచి వినుకొండ వైపు సివిల్ సప్లయీస్ బియ్యం లోడుతో వెళుతున్న లారీ వేమవరం వద్దకు వచ్చే సరికి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయట పడ్డారు. బియ్యం బస్తాలు పంట పొలంలో చెల్లాచెదురుగా పడిపోయాయి. సమాచారం మేరకు భట్టిప్రోలు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

చేబ్రోలులో నిషేధిత సిగరెట్ల పట్టివేత

కిరాణా షాపులో రూ.1.14 లక్షల సరుకు స్వాధీనం చేసుకున్న అధికారులు




సరుకును స్వాధీనం చేసుకున్న అధికారులు

చేబ్రోలు: మండల కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా నిషేధిత సిగరెట్లను విక్రయిస్తున్న కిరాణా షాపు యజమానిపై విజిలెన్స్ అధికారులు మంగళవారం క్రిమినల్ కేసు నమోదు చేశారు. గుంటూరు రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంటు ఎస్పీ కె.ఈశ్వరరావు ఆదేశాల మేరకు సీఐ ఏ శ్రీహరిరావు ఆధ్వర్యంలో దాడులు చేశారు. చేబ్రోలులో అక్రమంగా అనుమతి లేని, నిషేధించిన సిగరెట్ల విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారంతో విజిలెన్స్, రెవెన్యూ, పోలీసు అధికారుల సంయుక్తంగా స్థానిక వేంకటేశ్వరరావు కిరాణా షాపులో తనిఖీలు నిర్వహించారు. షాపు యజమాని ఊరా వెంకటేశ్వరరావు అనుమతులు లేని నిషేధించబడిన, హానికరమైన వివిధ బ్రాండ్ల సిగరెట్ల నిల్వలు షాపులో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. 'ప్యారిస్ సిగరెట్లు' 180 ప్యాకెట్స్, ''గోల్డ్ విమల్ సిగరెట్లు'' 620 ప్యాకెట్స్, ''గోల్డ్ విమల్'' ప్రీమియం సిగరెట్లు'' 470 ప్యాకెట్స్, ''మిడ్లాండ్ సిగరెట్లు'' 20 ప్యాకెట్స్‌లు మొత్తం వీటి విలువ రూ.1,14,500 ఉంటుందని అధికారులు తెలిపారు. షాపు యజమాని వెంకటేశ్వరరావుపై చేబ్రోలు పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ సీఐ ఏ.శ్రీహరి రావు తెలిపారు. స్థానిక రెవెన్యూ, పోలీసు అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రసవత్తరంగా ఎడ్ల బండ లాగుడు పోటీలు

మొదటి స్థానంలో నిలిచిన పెదకూరపాడు ఎడ్లు



పోటీలను ప్రారంభిస్తున్న గ్రామ పెద్దలు

మాచవరం: మండలంలోని మోర్జంపాడు గ్రామంలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బండ లాగుడు బల ప్రదర్శన పోటీలను గ్రామ మాజీ కరణం తంగెడ రామకృష్ణారావు మంగళవారం ప్రారంభించారు. జత పళ్ల విభాగంలో నిర్వహించిన పోటీల్లో మొత్తం 11 ఎడ్ల జతలు పాల్గొనగా, పల్నాడు జిల్లా పెదకూరపాడుకు చెందిన బెల్లంకొండ రామాయమ్మ, ఏటుకూరి శ్రీనివాసరావుల ఎడ్ల జత ప్రథమ స్థానంలో నిలిచాయి. పెదకూరపాడుకు చెందిన కన్నెదార రామ్ చౌదరి, ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం రామిరెడ్డిపల్లెకి చెందిన బుట్టా కార్తికేయ ఎడ్ల జత రెండవ స్థానాన్ని దక్కించుకున్నాయి. ప్రకాశం జిల్లా రాచర్ల మండలం కుంట కాడిపల్లికి చెందిన దండూరి శ్రీరాములు ఎడ్లు, కె.అచ్చయ్య (ఆత్మకూరు, దుర్గి మండలం, పల్నాడు జిల్లా) ఎడ్లు, షేక్ దస్తగిరి (ఆరవీటికోట, రాచర్ల మండలం, ప్రకాశం జిల్లా), ఆరేపల్లె శ్రీరంగం (బోడపాడు, మార్కాపురం, ప్రకాశం జిల్లా) ఎడ్ల జత, అత్తలూరి లక్ష్మీ తిరుపతమ్మ (మాచవరం మండలం, పల్నాడు జిల్లా) ఎడ్లు, కతుర్ల దీక్షిత్‌రెడ్డి, నిషాంత్‌రెడ్డి (అక్కలరెడ్డిపల్లి, గిద్దలూరు, ప్రకాశం జిల్లా) ఎడ్లు బహుమతులు అందుకున్నాయి.

స్ట్రాంగ్ రూమ్‌ల కోసం పరిశీలన

చీరాలటౌన్: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్‌కు ఉపయోగించే ఈవీఎం , వీవీ ప్యాడ్స్‌లను భద్రంగా ఉంచేందుకు స్ట్రాంగ్ రూమ్‌ల కోసం సెయింటాన్స్ ఇంజినీరింగ్ కళాశాలను మంగళవారం పరిశీలించారు. చీరాల తహసీల్దార్, ఏఈఆర్వో కె.నారసయ్య, ఎన్నికల సిబ్బంది చల్లారెడ్డిపాలెంలో ఉన్న సెయింటాన్స్ ఇంజినీరింగ్ కళాశాలను పరిశీలించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సార్వత్రిక ఎన్నికల్లో వినియోగించే ఈవీఎంలు, వీవీప్యాడ్స్ భద్రపరిచేందుకు కావాల్సిన గదులను, ఏర్పాట్లు సిద్ధం చేసేలా చర్యలు తీసుకుంటున్నామని ఏఈఆర్వో నాసరయ్య తెలిపారు.